# పట్టుతెరలు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

కొత్త ఊరు. మొదట్లో కొంత కంగారుపడ్డ మాట వాస్తవమే. అయినా అధికారులు చేసే పన్లన్నీ ఇలాగే ఉంటాయి. విశాఖపట్నంలో ఇరవై ఏళ్ళు నౌకరీచేసి ఇప్పుడిక కొద్దికాలంలో రిటైరయ్యే వయసులో బెజవాడ బదిలీ ఏమిటి చెప్పండి? మరి గత్యంతరం లేనప్పుడు నోరుమూసుకుని వాళ్ళ ఆజ్ఞానుసారం నడవవల్సిందే. నిన్ననే ఈవూరు వచ్చాను. నా చిన్నతనంలో ఎప్పుడో చూసిన పట్నం. మళ్ళీ ఇన్నాళ్లకి చూస్తున్నాను.

నిన్న సాయంత్రం సత్యన్నారాయణ కనిపించాడు. వాడ్ని పట్టుకుని మంచివాటా ఏదైనా చూసి పెట్టమంటే ఇవ్వాళ సాయంత్రం వాళ్లింటికి రమ్మన్నాడు. ప్రస్తుతం ఆఫీసులోనే మకాం. ఎలాగో రెండు రోజులు ఓపికపడితే సత్యన్నారాయణ ధర్మమా అని మంచివాటా ఏదైనా దొరుకుతే మకాం మార్చేయాలి.

సత్యన్నారాయణింటికి వెళ్లాను. వాళ్లింటి ముందే ఇల్లు. ఒక వాటా ఖాళీగా ఉందిట! అద్దె ముప్ఫై రూపాయలు. అయిదు గదులున్నాయి. ఇల్లు విశాలంగా గాలీ, వెలుతురూ చొరటానికి వీలుగానే ఉంది. అయితే ఉన్న అసౌకర్యమల్లా ఇంటి ఉనికి ఊరుకి చివరకావటం; నీళ్ల ఎద్దడి. చివరికెలాగో సర్దుకుని ఆ యింట్లోనే ఉండటానికి నిర్ణయించుకుని ఆఖరిమాటగా సత్యన్నారాయణని అడిగాను. "ఇంటివాళ్లు మంచివాళ్ళేనా" అని.

వాడేదో నసుగుతూ "మన నోరు మంచిదైతే ఊరంతా మంచిదే. ఎలాగో సర్దుకోవచ్చు లెద్దూ. చాలా పేదవాళ్ళు. ఇంటిమీద అద్దే ఆధారం" అన్నాడు.

"ఇంటాయన పేరు? ఉద్యోగం?"

"ఇంటాయన కాదు. ఇంటావిడ. ఆయనపోయి చాలా రోజులయింది." అన్నాడు సత్యన్నారాయణ.

ఆరోజే ఇల్లు తాళంవేసి ఒకనెల అద్దె అడ్వాన్సుకట్టి కొంత ముఖాముఖీని ఆవిడతో మాట్లాడి మరీ చక్కా వచ్చాను. ఇందాక సత్యన్నారాయణ చెప్పిందాన్నిబట్టి ఆవిడ కొంచెం పేచీకోరుమనిషి కాబోలు అనుకున్నాను. వాడు చెప్పే తీరు అలాగుంది మరి. అయితే ఆవిడ మాటలధోరణి విన్నతర్వాత నా అభిప్రాయం సత్యదూరమైంది కాబోలు అనే సందిగ్ధావస్థలో పడ్డాను. ఎంతో మంచితనం, మర్యాద, అవసరంలేని అణకువ ఆమె ప్రదర్శించటంబట్టి నేనలాగే అనుకున్నాను.

రాత్రి పదింటికి సరస్వతికి ఉత్తరం రాయటం ఉపక్రమించాను. ఆ రోజంతా ఆకాశం కారుమేఘాలు కమ్ముకుని మసక మసగ్గా ఉంది. ఆరోజు హోటలు భోజనంకూడా అలాగే ఏడిసింది రుచీ పచీ లేకుండా. ఈ చిరాకులో భార్యని ఒచ్చెయ్యమని రాద్దామనిపించినా పురిటికంటూ మళ్లీ మూడునెలల్లో ఎలాగైనా పంపించక తప్పదు కాబట్టి ఎందుకొచ్చిన అనవసరపు శ్రమ అనుకుని ఆ ఉద్దేశం విరమించుకున్నాను. ఆ ఉత్తరం పూర్తిచేసి మరో అరగంట పుస్తకం చదువుకుని మరీ పడుకున్నాను.

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. ఆఫీసు ప్యూనువచ్చి లేపేవరకూ మెలుకువే రాలేదు. ఆ సాయంత్రమే ఆఫీసునుంచి పెట్టే బేడా ఆయింటికి మార్చేశాను. ఇప్పుడు కొంత స్వేచ్ఛగా ఉంది. ఆఫీసులో ఉన్నందువల్ల వచ్చిన నష్టమేమీ లేదుగాని ఏమిటో పరాయివాళ్లదయా ధర్మాల మీద జీవించటంలా ప్రాణం చచ్చిపోయినట్టుగా ఉంటుంది. ముప్ఫైరూపాయిలు పడేస్తే హాయిగా

ఉండొచ్చు. ఇల్లు ఊరికి దూరమైనా ఆఫీసుకు దూరం కాదు. అయితే హోటలుమటుకు దూరం.

ప్రతిరోజూ సాయంత్రం చాలా సరదాగా గడిపేవాళ్లం. సత్యన్నారాయణకోసం రోజూ ఎవరో వస్తూనే ఉండేవారు. వాళ్లతో రాత్రి పదింటివరకూ మధ్య హాలులో పేకాట వేసేవాళ్లం. మంచికాలక్షేపంఅయిపోయేది. కొత్తచోట ఒంటిగా ఉన్నాననే దిగులూ, బెంగా ఇప్పుడు లొంగదీసుకోలేకపోతున్నాయి నన్ను.

చేతివాచీకేసి చూసి "అబ్బో! పది దాటింది. ఇక పోదాం" అన్నాడు సత్యన్నారాయణ. ఆతర్వాత అతనూ రెండు మూడుసార్లు ఆవులించి చేతిలో ముక్కలు నిద్రమత్తులో జారవిడిచాక గాని మిగతా వాళ్ళకి అక్కడితో ఆట కట్టిపెడదామనే ధ్యాసే లేనట్టుంది. నేను మాత్రం ఏదో సభ్యతకోసం అన్నట్టుగా ముంచుకొస్తున్న నిద్రని బలవంతాన ఆపుకుంటూ—మధ్య మధ్య ఆ విషయం వాళ్లు గుర్తిస్తారేమోనని తెచ్చికోలు నవ్వులు నవ్వుతూ నటన సాగిస్తున్నాను.

చివరికి సత్యన్నారాయణ "మన మూలాన ఇరుగుపొరుగు వాళ్లకి కూడా నిద్రాభంగం. ఈ లెక్కని కొద్ది రోజుల్లో ఇరుగు పొరుగు వాళ్లకి చెడ్డవాళ్లమయిపోతాం." ఉన్నట్టుండి గొంతు తగ్గించి "ఎవరి మాటెల్లాగున్నా ఇంటావిడ మటుకు దీనికి తగిన మందు కనిపెడుతూనే ఉంటుంది. పైవాళ్లం మాదేముందిలే! ఎటొచ్చీ నీ సంగతి చూసుకో" అన్నాడు నన్నుద్దేశించి.

ఆవిడ ప్రస్తాపన వచ్చినప్పుడల్లా సత్యన్నారాయణ ఈ ధోరణి అవలంబించటం నాకు కష్టంగానే ఉంది. "ఫర్వాలేదులే. ఆ మందుకి విరుగుడు నాకు తెలుసు. నువ్వేమీ బాధపడకు" అన్నాను.

"ఆవిడ భర్త పోలీసు హెడ్డు. ఈ చుట్టు పక్కల మంచి పేరు మోసినవాడు. పాపం ఓ సుముహూర్తాన ఆవిడ చేతి చీపురుదెబ్బలుకూడా రుచి చూశాడు. మళ్లీ చనిపోయేవరకూ ఆవిడ ముందు నోరెత్తి ఆవిడ అవునన్నది కాదంటే ఒట్టు. హెడ్డుగారంటే ఈ ఊరంతా తెలుసు. మరో ఫార్సు జరుగుతూండేది. మాతో కలిసి పేకాట ఆడుకోవాలని మహా ఉబలాటపడేవాడు. అయితేనేం ఏ తలుపు వారనుంచో భార్య గుడ్లుఎఱ్ఱ చేసిందంటే గబగబా ఏమీ ఎరగనివాడిలా జాబిరీలోంచి గదిలోకివెళ్ళి రాసుకుంటూ కూర్చునేవాడు. పాపం! అల్పజీవి!" ఈ చివరి వాక్యం హేళనగా పూర్తిచెయ్యటంతో మిత్రులంతా కొంచెం పెద్దగానే నవ్వారు. "జాగ్రత్త అవతల ఆవిడికి వినిపిస్తుంది" అన్నట్టుగా సౌంజ్ఞచేశాడు సత్యన్నారాయణ.

ఈవిడ చరిత్ర వినటానికి వినోదంగా ఉంది కాబోలు అందరికీ నిద్రలు తేలిపోయాయి. సత్యనారాయణ వేపు రెప్పవెయ్యకుండా చూస్తున్నారంతాను.

చివరికి నేనే ఈ చర్చని ఓ కడకు చేరుస్తూ "ఇక పడుకుందాం. పదకొండు దాటింది" అన్నాను.

అంతటితో ఈ పరనింద ఆగిపోయింది. ఎవరికి వారు తోచినట్టుగా అభిప్రాయాలిస్తూ సత్యన్నారాయణని అనుసరించారు.

ఆ తర్వాత చాలా సేపటివరకూ నా మెదడంతా మా ఇంటావిణ్ణి గురించిన ఆలోచనలతో నిండిపోయింది. మర్నాడు ఎలాగైనా వీలుచేసుకుని ఆవిడతో మాట్లాడాలనుకున్నాను. ఎందుకో తెలియదు కాని సత్యన్నారాయణ చెప్పిందాన్నిబట్టి ఆవిణ్ణి గురించి పూర్తిగా తెలుసుకోవాలనే పట్టుదలా, ఉత్కంఠా నాలోనూ కలిగాయి.

ఉదయం ఏడు దాటి ఉంటుంది. వాళ్ళ జాబిరీకి మా జాబిరీకి మధ్య ఓ తడకమాత్రం అడ్డం. పడకకుర్చీలో కూర్చున్నాను. అవతల్నించి వాళ్ళెంత నెమ్మదిగా మాట్లాడినా నా చెవులో చెబుతున్నట్టే ఉంటుంది.

ఇంటావిడ ఎవరితోనో మాట్లాడుతోంది. ప్రసంగ విషయం స్పష్టంగా బోధపడుతోంది.

"పోనీలే తల్లీ. ఈ ప్రపంచంలో ఎవరుమటుకు శాశ్వతంగా ఉండబోతున్నారు. ఏదో పెంచిన మమకారం అలా అనిపిస్తుంది. మీ శాయశక్తులా మీరు కష్టపడ్డారు. భగవంతుడు తప్పదలిచాడు. దాని ఆయుర్దాయం అంతటితో సరి"—అనునయంగా మాట్లాడుతోంది ఇంటావిడ.

"అయ్యో! చెట్టంత కూతుర్ని నా పొట్టను పెట్టుకున్నాను తల్లీ దాన్నుంచి నన్నన్నా తీసుకుపోయాడు కాడు భగవంతుడు."

# పట్టుతెరలు

ఆవిడ కూతురు చనిపోయింది. ఆ బాధనంతా ఒకళ్లముందర వెళ్ళబోసుకుని ఎదటివాళ్ళ సానుభూతి, అనునయ వాక్యాలతో కొంత ఉపశమనం పొందటంకోసం ఆవిడ ఆ ప్రస్తాపన తీసుకొచ్చింది కాబోలు.

"అవునుగాని మీ అల్లుడుగారు మళ్లీ పెళ్ళిచేసుకుంటున్నారని విన్నాను. అదెంతవరకూ నిజం?" ఇంటావిడ అడిగింది.

"నేనూ విన్నాను. అయితే కావచ్చు. ఎవరెలాపోతే నాకేం తల్లీ! నా కూతురుకి నూరేళ్లూ నిండిపోయాయి" అంది బొంగురు గొంతుతో ఆమె.

"మీరు మరీనండీ ఎలాగో ఓర్చుకోవాలిగాని పోయినవాళ్లతో మనమూ పోతామా? మనిషై పుట్టింతర్వాత చావు తప్పుతుందా భగవంతుడి దయ"—నాకీ చివరివాక్యం విన్నతర్వాత సత్యన్నారాయణ చెప్పింది జ్ఞాపకం వచ్చింది. తరచు ఆవిడ భగవంతుడి ప్రస్తావన లేకుండా ఏ విషయమూ ప్రస్తావించదని సత్యన్నారాయణ చెప్పాడు. వాడు చెప్పింది అక్షరాలా నిజం!

ఆ తర్వాత ఆమె చాలా విషయాలు చెప్పింది. ఇంటావిడ శ్రద్ధగానే వింటోంది కాబోలు మధ్యమధ్య ఈ జాలిగాథకు కరిగిపోయినట్టుగా నిట్టూర్పులు విడుస్తోంది.

ఇంతట్లో వంటగదిలోంచి చిన్నకొడుకు కేకేశాడు. "ఒస్తాను పనుందంటూ ఇంటావిడ లోపలికి పోవటంతో ఆ అపరిచితవ్యక్తి లేచి వెళ్లిపోయింది. ఆవిడ వ్యథిత హృదయాన్ని అర్థంచేసుకున్నానేమో నాకూ చాలా జాలివేసింది. నాకు నా చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. తెల్లవారి లేచింది మొదలు అమ్మ ముఖం కడగాలి, అమ్మ కాఫీ తాగించాలి, అమ్మ బట్టలు కట్టాలి ఇలా నా దైనందిన కృత్యాలన్నీ నా ప్రయత్నం, ప్రమేయం లేకుండానే జరిగిపోయేవి. రాత్రి అమ్మ అన్నం తినిపించేటప్పుడు, అమ్మ ఒడిలో కూర్చుని రాజకుమారుడి కథ వింటూన్నప్పుడూ, రాత్రి జోకొడుతూ, పాడుతూ నిద్రపుచ్చేటప్పుడు, ఎందుకో ఒక్కసారి ఆమె కంఠం కౌగలించుకుంటేగాని తృప్తిగా ఉండేదికాదు. ఇవన్నీ గడిచిపోయిన గాథలు, నిరంతరం జ్ఞాపకముండే మధుర స్మృతులు. ఆ రోజుల్లో అనుకునేవాణ్ణి "అమ్మని విడిచిపెట్టి ఒక్క నిముషం ఉండగలనా" అని.

ఆ తర్వాత కొన్నాళ్లకి "పుట్టిన ప్రతి ప్రాణీ చనిపోతుందన్న పరమసత్యం తెలుసుకున్న తర్వాత అమ్మ చనిపోతే ఈ ప్రపంచంలో జీవించటం ఎలా" అనుకుని బాధపడ్డాను. అప్పుడప్పుడు ఈ తలపు వచ్చినప్పుడల్లా లోపల్లోపల ఏడ్చేవాణ్ణి కూడా. ఎందుకో "అది అసంభవం, అలా జరగటానికి వీల్లేదు" అనుకునేవాణ్ణి.

నా ఇరవయ్యో ఏట ఆమె చనిపోయింది. అప్పటి కామె వయస్సు నలభైఅయిదేళ్లే. చాలా మందికి మల్లేనే ఆమె బాధపడి మరీ చనిపోయింది. అసంభవం, అలా జరగటానికి వీల్లేదు అనుకున్నదే చాలా సామాన్యంగా జరిగిపోయింది. ఆ తర్వాత తర్వాత అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చి నన్ను కలవరపరచే స్మృతిగానే మిగిలిపోయింది.

"ప్రకాశం!"—సత్యన్నారాయణ పిలుపుతో ఆలోచనలన్నీ చెల్లాచెదరయిపోయాయి.

"రా! కూర్చో"

సత్యన్నారాయణ నేరుగా లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. "ఆఫీసుకు వేళ కాలేదూ?" అని అడిగాడు.

"ఇవ్వాళ ఒంట్లో అదోలాగుంది. భోజనం కూడా మానేద్దామనుకుంటున్నాను. ఆఫీసుకు పోవాలని లేదు" అన్నాను.

"సరే అయితే సెలవుచీటీ రాసియ్యి. తీసుకుపోతాను." రాసిచ్చాను. అతను వెళ్ళిపోయాడు.

పదకొండు గంటలవరకూ పుస్తకం చదువుకుంటూ గడిపాను. ఆతర్వాత నిద్రపోయాను. తిరిగి మెలుకువ వచ్చేసరికి పన్నెండు దాటింది. ముఖం కడుక్కుందామని పెరట్లోకి పోయేసరికి వాళ్ళ వంటింట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. భోజనం చేస్తున్నారు కాబోలు.

తడికవారగా వెళ్ళి నిలబడ్డాను.

"బంగాళాదుంపలకూర వేసుకోవూ? పోనీ కాబేజీ కూరన్నా తిను—ఛీ! పాడు పిల్లలు! ఎంత ఖరీదైన వంటకాలు చేసుకున్నా ముట్టుకోరుగదా

కర్మ! అందుకే అలాగ ఏడుస్తున్నావు వుసూరు మంటూను."

"నా కొద్దంటే ఎందుకే బలవంతపెడతావు" అంటోంది చిన్నకూతురు.

"దేనికైనా రాసిపెట్టుండాలి, అనుభవించటానికి" అంది ఇంటావిడ.

నాకు మొదట్లో సత్యన్నారాయణ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. పేదవాళ్లనీ, ఇంటి అద్దే ఆధారం" అనీ చెప్పాడు. ఇప్పుడు వాళ్ల ధోరణి మటుకు సత్యన్నారాయణ చెప్పిందానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది. మా యింట్లో కూడా ప్రతీ పూటా బంగాళదుంపల కూరా, కాబేజీకూరా వండుకోవటం నే నెరగను.

నిన్న కూడా వీళ్ళు చాలా ఖరీదైన వంటకాలే చేసుకున్నారు. సత్యన్నారాయణ అన్నంత పేదవాళ్ళు కారు, ఇంటి అద్దే ఆధారంగా జీవిస్తున్న వాళ్లూ కారు" అనుకున్నాను. బహుశా కొంత ఆస్తి కూడా ఉండిఉండాలి.

నేను ఉండబట్టలేక ఓ చిలిపిపని చేశాను. తడిక సందులోంచి వాళ్ల వంటగదిలోకి చూశాను. క్షణం నిశ్చేష్టుణ్ణయాను.

వాళ్లు తాగుతున్నది ఉత్తి గంజి! పచ్చి గంజి! ముగ్గురు ముందూ మూడు కంచాలున్నాయి. ఆ కంచాల్లో ఒకటి రెండు రొట్టెలకంటె ఎక్కువ లేవు. ఆ రొట్టెలు తిని ఆ గంజి తాగేసి వాళ్లు ముగ్గురూ లేచారు. అంతా నటన! ప్రతిరోజూ ఈ విధమైన నాటకం ఆవిడ ఎందుకు ఆడుతున్నట్టో! నలుగురూ ఆవిడ్ని పేదవాళ్లు అనుకోవటం నామోషీ కాబోలు! గొప్పగా మాట్లాడినంతమాత్రాన ఆవిడ నిజస్థితి తెలియకుండా ఉంటుందా? సత్యన్నారాయణ చెప్పింది వాస్తవం! వాళ్లు పేదవాళ్లని మనం సానుభూతి చూపించటానికి ఇష్టపడదు. తమాషా వ్యక్తి!

ఆతర్వాత తర్వాత వాళ్లేది మాట్లాడుకుంటున్నా వినా లనిపించేది. ఓ రోజు నేను మరో విషయం గ్రహించాను. ప్రతి దినం భోజనానంతరం వాళ్లు ముగ్గురూ మధ్యహాల్లో కూర్చుని ఎవరైనా ఆపూట వంటకాలగురించి అడిగితే ఏవేవి చెప్పాలో ముందుగానే కూడాబలుక్కు నేవారు. అమ్మలక్క లెవరైనా ఆ ప్రస్తాపన తెస్తే తడుముకోకుండా ఏవేవో చెప్పేసే వారు.

అప్పుడప్పుడు రెండు మూడు రోజుల కోమారు ఆ ముసలావిడ వచ్చి కూతుర్ని తల్చుకుని కంటనీరు పెట్టుకునేది. ఒకనాడు ఆవిడముందు ఇంటావిడ ప్రదర్శించిన వైఖరి చూస్తే నాకు అమిత ఆశ్చర్యంవేసింది. అంత నిష్కర్షగా, నిర్మొహమాటంగా ఎలా మాట్లాడగలిగిందా అనిపించింది.

"ప్రతినిత్యం అయిన వేళా కాని వేళా వచ్చి నట్టింట్లో ఇలా కన్నీరు కారిస్తే ఈ కొంపలో సుఖంగా బ్రతకలేమండీ. నీ కూతురు పోతే నాకేవిటి మధ్యని. నా కూతుళ్లూ, కొడుకూ సుఖంగా ఉండిపోయారని మీకేదో దుగ్ధగా ఉన్నట్టుంది. ఇకనించీ మా గుమ్మంలో అడుగు పెట్టకండి" అంది ఇంటావిడ.

ఆ ముసలావిడ మారుమాట్లాడకుండా వెళ్లిపోయింది. నా నోట మాట పెగల్లేదు.

ఆ రోజు ఆదివారం. సాయంత్రం సత్యన్నారాయణా నేనూ సినిమాకని బయల్దేరాము. ఇంటావిడ బయట కూచున్నదల్లా లేచి లోపలికి వెళ్లిపోయింది.

తీరా సినిమా మొదలుపెట్టే సరికి సగంలో ఇంటికి వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. సభ్యత కోసం కళ్లుమూసుకుని ఆటు అయేవరకూ ఓపిక పట్టాను.

బయటి కొచ్చింతర్వాత సన్నసన్నగా వాన తుపర ప్రారంభమైంది. ఇంటికి చేరేసరికి పదిన్నర యింది. ఇంటి కొచ్చినతర్వాత సరస్వతి పేర ఉత్తరం రాశాను. "ఒక కొత్తరకం మనిషిని ఈ ఉత్తరం ద్వారా పరిచయం చేస్తున్నాను. ఇప్పుడు నే ఉంటున్న ఇంటావిడే ఆ వ్యక్తి. చాలా తమాషా మనిషి. చాలామందితోపాటు నువ్వూ ఆవిడ్ని అసహ్యించుకుంటావు. నెలకో ఏభైరూపాయిలు అద్దెల మీద వస్తాయి. ఆపైన ఆదాయం చిల్లిదమ్మిడీ లేదు. భర్త చనిపోయాడు. ఒక ఆడపిల్లకి పెళ్లయిపోయింది. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇంకో ఆడపిల్ల పెళ్ళికి ఎదిగిఉంది. ఇంకో మొగపిల్లవాడున్నాడు. వాడికి చదువూ సంధ్యా లేదు. ఇలాటి నిత్యకాటకపు రోజు ఏభైరూపాయిల్తో గుట్టుగా అంత సంసారం గడుపు కొస్తోందంటే నాకే మొదట్లో ఆశ్చర్యం

వేసింది. నమ్మలేకపోయాను. కాని అది యథార్థం. ఆవిడ గురించి ఎవరూ జాలిపడకూడదు; అందు కావిడ ఒప్పుకోదు కాబట్టి. ఓపూట తినీ, ఓపూటా తినకా అలా గడుపుకొస్తోంది. బైటవాళ్ళకి మటుకు తన నిజస్థితి తెలియకుండా గొప్ప కబుర్లు చెబుతూంటుంది." —ఇలా ఆమెగురించి రాసుకొచ్చాను. టైము పదకొండు దాటింది. నిద్ర ముంచుకొస్తోంది. తలుపులు వేసి పక్కమీద చారబడ్డాను.

* * * *

"మా ఇంటావిడకు ఈ ఊళ్లో బంధువు లెవరూ లేరా ఏమిటి?" అని అడిగాను సత్యన్నాయణని.

"అలా అని ఆవిడందా?" అన్నాడు సత్యన్నారాయణ.

"అబ్బే! లేదు. నేనే అడుగుతున్నా"

"చాలామంది ఉన్నారు. అన్నగారు, తండ్రి, అప్పగారు. పెద్దకొడుకు అంతా ఈ ఊళ్ళోనే ఉన్నారు."

"అహాఁ!" అన్నాను ఆశ్చర్యంగా. నేనొచ్చి పదిహేను రోజులయింది. ఒక్కనాడు వాళ్లనిగురించిన ప్రస్తావన ఆ యింట్లో రావటం నే వినలేదు. నేనేదో అడగాలని ప్రయత్నించే లోపునే "అయితే మాత్రం ఏం ప్రయోజనం? ఇంతమందిలోనూ ఏ ఒక్కరూ ఆవిడ దృష్టిలో ఆప్తులు కారు." అన్నాడు సత్యన్నారాయణ.

"బహుశా వాళ్లవల్ల ఆవిడ కొంత నష్టపోయి ఉండొచ్చు." అన్నాను.

నా తలకాయ! ఎవరూ దాని కేవిధమైన అన్యాయమూ చెయ్యలేదు." అన్నాడు సత్యన్నారాయణ.

"ఆ విషయం నీ కెలా తెలుసు?"

"నేనూ ఆవిడ బంధుకోటిలో ఒకణ్ని కాబట్టి."

నే నాశ్చర్యపోయాను. సత్యన్నారాయణ ఆవిడ ఆత్మీయుల్లో ఒక డన్న విషయం నా కింత వరకూ తెలియదు. "అయితే నీతోనూ ఆవిడకి మాటల్లేవేమిటి?" అని అడిగాను.

సత్యన్నారాయణ తల అడ్డంగా ఊపి "మాటల్లేవు" అన్నాడు. ఆవిడను గురించి సత్యన్నారాయణ చెప్పే ప్రతివిషయం ఆశ్చర్యకరమైందిగానే ఉంటోంది. ఇంతమందితో ఆవిడెందుకు తెగతెంపులు చేసుకున్నట్టు? ఏదో ప్రబలమైన కారణం ఉండి ఉండాలి అనుకున్నాను. అయితే ఆ కారణాలు ఏమిటో వాటిగురించి ఊహించి ఆ ఊహని ఆధారం చేసుకుని తర్జన భర్జనలు చెయ్యటానికి తగినంత సావకాశం నాకు లభించలేదు. హోటల్నుంచి నేరుగా ఆఫీసుకు వెళ్ళిపోయాను. సాయంత్రం భోజనంచేసి ఇంటికొచ్చేసరికి దీపాలవేళయింది. ఇంటివాళ్ల గుమ్మంలో ఏవో కొత్తముఖాలు కనిపించాయి. తర్వాత వాళ్ల ధోరణిబట్టి ఆ వచ్చింది ఇంటావిడ పెద్దకూతురని గ్రహించగలిగాను. ఆపూటే వచ్చి ఉంటారు.

కాళ్లు కడుక్కుని కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుదామని తెరిచాను. కళ్లముందు పేజీలు తిరిగిపోతున్నాయన్న మాటేగాని విషయం మటుకు బుర్రకెక్కటంలేదు. పక్కవాటాలో వాళ్లమాటలు వినాలనే ఉత్సాహాన్ని ఇవేవీ ఆటంకపరచలేక పోతున్నాయి.

"ఒకటా రెండా? అరవై రూపాయలు! నీకిద్దామనే జాగ్రత్తచేశాను. తీరా బండి ఎక్కబోయేముందు చూసుకుంటే అంత డబ్బూ మాయం అయి ఊరుకుంది. అత్తగారు తియ్యకపోతే ఏమైయుంటాయి చెప్పు. అడుగుతే 'నాకేం తెలుసూ' అంటూ బుకాయించింది" పెద్దకూతురు చెబుతోంది.

ఇంటావిడ ఊరంత గొంతుచేసుకుని "ఏమో! అదే తీసిందో, లేకుంటే నువ్వాడేదే అబద్ధమేమో!" అంది కఠినంగా. పెద్దకూతురు "అదేమిటే అలాగంటావు. తేపా వచ్చినప్పుడల్లా పాతికా ముప్ఫై నీకిచ్చిపోవటంలా? అబద్ధం ఆడాల్సిన అవసరం నాకేమిటి?" అంది.

"ఏమో నాకెలా తెలుస్తుంది. ఒక్కమాట చెబుతున్నాను విను: నువ్వి ఇంటికి రాదల్చుకుంటే, నువ్వెన్నాళ్లిక్కడ ఉండదల్చుకున్నావో అన్నాళ్లకీ నీకయే ఖర్చులు నువ్వే భరాయించుకోవాలి. లేకుంటే మిమ్మల్నందర్నీ పోషించటం నాతరం కాదు. ఈ కుంటిసాకులు నాదగ్గర పనికిరావు."

"సరేలే అలాగయితే రేపే వెళ్ళిపోతాను. ఒక్కరోజుకూడా ఉండను"—పెద్దకూతురు గొంతు రుద్ధమయింది.

ఇంటావిడ దృఢమైన స్వరంతో "మంచిది అలాగే చెయ్యి" అంది.

ఏవిఁటీ మనిషి! రాకరాక సంవత్సరానికోమారు ఆడపిల్ల పుట్టింటికి వస్తే ఎంత ఆదరణ, ఎంత ఆప్యాయత, చూపెట్టాలి! అది లేదు సరిగదా ఆమె వచ్చినప్పుడల్లా ఆమె తిండికయ్యే ఖర్చు ఆమె భరించుకోవాలా! నాకంతా అయోమయంగా కనిపించింది. ఆవిడ గురించి ఆలోచించాలని ప్రయత్నిస్తే వాటికో అంతూ దరీ అంటూ కనుపించవు.

ఆ మర్నాడు ఉదయయే పెట్టే బేడా సర్దుకొని పిల్లలతో సహా తిరిగి అత్తవారివూరు వెళ్ళిపోయింది. నిన్న సాయంత్రం వచ్చి ఈ ఉదయం వెళ్లిపోతోందంటే ఆ వెళ్ళటం ఆమె కెంతకష్టం కలిగిస్తుందో నాకు తెలుసు. ఆమె ముఖమంతా నిగారించి చారికలు కట్టిఉంది. రాత్రంతా ఏడ్చిఉంటుంది. ఇంటావిడ మటుకు నిశ్చలంగా గుమ్మందగ్గర నిలబడి వీడ్కోలిచ్చింది.

ఓ గంట పోయింతర్వాత ఎవరితోనో "మా అమ్మాయి మావగారికి సీరియస్‌గా ఉందిట. టెలిగ్రాం వచ్చింది. అందుకని వెళ్లిపోయింది" అనటం విన్నాను.

సాయంత్రం సత్యన్నారాయణతో ఇలా జరిగిందని చెప్పాను. ఇదేదో చాలా సామాన్య విషయం అన్నట్టుగా చప్పరించి ఊరుకున్నాడు. క్షణం పోయింతర్వాత "నీకో మంచివార్త" అన్నాడు సత్యన్నాయణ ఉన్నట్టుండి.

"ఏవిఁటది?"

"బహుశా ఒకటి రెండు నెలల్లో నీకు విజయనగరం బదిలీఅవుతుందనుకుంటున్నారు. నీకిష్టమేనా"?

"అంతకంటే కావాల్సిం దేముంది?" అన్నాను.

మొదట్లో ఈ వార్త నమ్మలేకపోయాను గాని తర్వాత ఆఫీసులో కనుక్కుంటే నిజమే అని తేలింది. బ్రతుకుజీవుడా అనుకున్నాను.

* * *

ఉదయం ఏడుదాటింది. గుమ్మంలో కూచుని చదువుకుంటున్నాను. గుమ్మంముందు ఆ కాస్తజాగా పనిమనిషి శుభ్రంచేసి వెళ్లిపోయింది. పెరుగువాళ్లూ, పాలవాళ్ళూ, కూరగాయలవాళ్లూ అరుచుకుంటూ పోతున్నారు.

"బాబూ!"—ఈ కంఠం విని ముఖమెత్తి చూశాను. ముష్టివాడు! జేబులో అర్ధణా ఉంది. అది వాడిచేతిలో పడేశాను. అక్కణ్ణించి వెళ్లి పక్కవాటా గుమ్మంముందు నిలబడి పిలుస్తున్నాడు. ఇంటావిడ గుమ్మం వారగానే కూర్చుని ఉంది. నేను అర్ధణా ఇవ్వటం ఆవిడ చూసే ఉండాలి. నాకు వినపడేట్టుగా వాణ్ణి పొమ్మని కసిరి కొట్టి "పాడు వెధవలు! తినమరిగి ఈ కొంప విడిచిపెట్టలేకపోతున్నారు. ఎంత డబ్బు! ఎనెన్ని బట్టలు ఎలా దానంచేసేవా రాయన! (ఆవిడ భర్తగారన్న మాట!) పెట్టే కొంపేదో, పెట్టని కొంపేదో వాళ్లిట్టే పసిగడతారు. అంతా మోసం! ఈ బియ్యం తీసుకెళ్లి బజార్లో అమ్ముకోవటం నా కళ్లతోనే చూశాను. ఇటువంటి వాళ్ళకు దానంచేస్తే పాపం చుట్టుకుంటుంది కూడాను."—పుస్తకం ఎప్పుడో మూసేశాను. పగలబడి నవ్వాలనిపించినా బలవంతాన అణచుకున్నాను. ఏ క్షణాని కాక్షణం అవిణ్ణి ఆవిడ రక్షించుకుందుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. కేవలం వాళ్లు తన్ని మోసం చేస్తున్నారని తెలిసింతర్వాతే ఆవిడ దానధర్మాలు ఆపుకుందనీ, ముష్టివాళ్లంటే ఆవిడా ఒకప్పుడు ఆదరణ చూపిందనీ, అవిడెంతో సహృదయురాలనీ మనం అనుకోవాలని ఆవిడ తాపత్రయం. ఎవరైనా ఆవిడగురించి తేలిగ్గా అభిప్రాయపడతారేమోనని ముందుగానే జాగ్రత్తపడుతూంటుంది. ఆతర్వాత ఆవిడ కూతురుకి ముష్టివాళ్లగురించి చాలా కట్టుకథలు చెప్పింది.

నేను తాళంవేసి హోటలుకు బయల్దేరాను.

* * * *

ఓనాడు ఉదయం మధ్య హాల్లో కూర్చుని ఇస్త్రీ బట్టలు సర్దుకుంటున్నాను. ఇంటావిడ చిన్నకొడుకు వచ్చి గుమ్మం వారగా నిలబడ్డాడు. అత నొచ్చి చాలసేపయి ఉంటుంది. నే తలెత్తి చూసేసరికి గుమ్మంవార నిలబడి వీపు గోక్కుంటున్నాడు. ఒంటిమీద బనీనైనా లేదు. నెత్తిమీద జుట్టు పెరిగిపోయి చెవులమీదికి పడుతోంది.

"ఎంతసేపయిందోయ్ వచ్చి. పిలవలేదేం?" అన్నాను. అత నక్కడే చతికిలబడి "ఈపూటకి మాయింట్లో బియ్యం నిండుకున్నాయి. ఓ రూపాయి ఉంటే ఇస్తారూ?"—అతను చెప్పబోయేది ఇంకా

పూర్తికానేలేదు. లోపల్నించి 'చలపతీ!' అంటూ కేకేసింది ఇంటావిడ. ఆవిడ గొంతువిని నేనే చాలా కంగారుపడ్డాను. వాడు పిల్లిలా ముడుచుకుపోయాడు. ఆవిడ మళ్లీ కేకేసింది. జేబులో రూపాయితీసి అతనికి ఇవ్వబోయే లోపునే చరచరా వెళ్లిపోయాడు చలపతి.

హఠాత్తుగా కుర్రాడి ఏడుపు వినిపించింది. ఆవిడ కొడుతోంది. ఎంతెంత దెబ్బలు! వాడు తట్టుకోగలడా! వాడి గోల వినలేక కలగజేసుకుందామని క్షణం యోచించాను. ఆవిడ సరైన మనిషికాదు. పొరబాటున 'నీ జోక్యం అనవసరం' అంటే ప్రాణం చచ్చిపోతుంది. తటపటాయించాను. ఆమె స్వభావం తెలుసుండబట్టి ఆ క్షణంలో అమానుషంగా ప్రవర్తించకుండా ఉండలేకపోయాను.

ఆవిడ మాటలు వినిపించాయి. "ఇంట్లో బియ్యం లేవని నీకు నేను చెప్పానా? వంద రూపాయిల నోటుకు చిల్లర లేక పూజ ఆగిపోతుందని ఓ రూపాయి అప్పు తీసుకురమ్మంటే ఉన్నవీ లేనివీ అనవసరపు కూతలు కూస్తావూ?" అని కేక పెడుతోంది.

ఆ తర్వాత పనిమనిషిచేత రూపాయి పంపించాను. ఆవిడ తలుపువార నిలబడి బాబుగారూ?" అని పిలిచింది.

"నన్నేనాండీ!" అన్నాన్నేను.

"అవునండి. దేముడికి పూజ చేయిద్దామని అనుకున్నాను. దగ్గర వందరూపాయిల నోటు తప్పించి చిల్లరలేదు. ఈ చుట్టుపక్కల దొరకదు. అలా అని చెప్పరా అంటే వాడేదో వాగేశాడు." అంది.

ఇదే ఆవిడతో మొదటిసారి మాట్లాడటం ఈ ఇంటికి వచ్చింతర్వాత. అంతకుముందు ఓమారు మాట్లాడాననుకోండి. ఆ తర్వాత అప్పుడప్పుడు పోస్టుమన్ ఉత్తరాలిచ్చేటప్పుడు మీ ఊళ్లో అంతా క్షేమంగా ఉన్నారాండి" అని యోగక్షేమాలు కనుక్కుంటూంటుంది.

'అంతా బాగానే ఉన్నారండి' అంటూండేవాణ్ణి.

అప్పుడప్పుడు ఏ సాయంత్రం పూటో తీరిగ్గా కూచున్నప్పుడు పలకరిస్తూండేది. పిల్ల పెళ్లివిషయంలో ఆమె కేమీ దిగులు లేదుట! అనువైన సంబంధం చూసి త్వరలోనే ముడిపెట్టేస్తుందిట. పిల్లవాడి చదువుగురించి మాత్రం నింద వాడిమీదే తోసేసింది. వాడే చదువుకోమంటే చదువుకోలేదుట. ఇలా చాలా జాగ్రత్తగా తన నిజస్థితి కప్పుకుంటూ తెలివిగా మాట్లాడుతూంటుంది.

పిల్ల పెళ్ళి విషయంలో ఆమె కేమీ బెంగ లేదంటే నమ్మలేకపోయాను. ఆమె స్వభావం నాకు తెలుసు కాబట్టి అలాగే మాట్లాడుతుం దనుకున్నాను. డబ్బుకు సంబంధించిన పనేదైనా సరే తను చాలా సునాయాసంగా నిర్వహించగలదని మనం అనుకోవాలని ఆవిడ ప్రయత్నం.

ఆవిడ చెప్పేదంతా శ్రద్ధగా విని ఆవిడ అభిప్రాయాల్తో ఏకీభవిస్తున్నట్టే నటించేవాణ్ణి. ఓనాడు చొరవచేసుకుని "మీ అబ్బాయిని రోజూ ఉదయం నాదగ్గిరికి రమ్మనండి. చదువు చెబుతాను" అన్నాను.

"అంతకంటేనా తప్పకుండా పంపిస్తాను." అంది.

ఒక్కొక్కప్పుడు ఆవిడ మాట్లాడే విషయాలు వినటానికి నాకే సిగ్గుగా ఉండేది. అసహ్యం కూడా వేసేది. పరాయివాణ్ణి, కాస్త చొరవ ఉందికదా అని అయిదారేళ్లనించీ వైధవ్యం అనుభవిస్తూ ఏభై ఏళ్లు నెత్తిమీది కొచ్చింతర్వాత ఇప్పుడిక తన పెళ్లినాటి సంగతులన్నీ ఎత్తుకొస్తే వినటాని కెలాగుంటుందో ఆలోచించండి. ఆ తర్వాత తర్వాత ఆవిడతో మాట్లాడాల్సి వస్తే తప్పించుకుందుకు సాధ్యమైనంతవరకూ ప్రయత్నించేవాడిని. ఆఫీసు టైముకు ఓ గంట ముందునే బయటికి వెళ్ళిపోయేవాణ్ణి. తిరిగి ఆఫీసునుంచి వచ్చినప్పుడు నేరుగా లోపలికి వచ్చేసేవాణ్ణి.

* * * *

రోజూ ఉదయం ఏడు కొట్టేసరికి చలపతి నాదగ్గర చదువుకుందుకని వస్తున్నాడు. ఓ గంట అతనితో గడుపుతున్నాను. కుర్రాడు తెలివైనవాడే. చదువంటే చాలా శ్రద్ధా, పట్టుదలా ఉన్నట్టు గ్రహించాను. ఓనాడు పాఠం చెబుతూంటే చలపతి అడిగాడు "ఈ ఏడాది నన్ను స్కూల్లో చేరిపించరూ?" అని.

"ఏం? నీకు స్కూల్లో చేరాలని ఉందా?" అన్నాను.

ఇంత ముఖం చేసుకుని అవునన్నట్టుగా తల ఊపాడు.

"అలాగే చేరిపిస్తాను. నువ్వు బాగా చదువుకోవాలి మరి."

"ఇప్పుడుమటుకు బాగా చదువుకోటం లేదూ" —చలపతికి అభిమానం వేసింది.

"అబ్బే! ఆమాట నేనన్నానా! బాగానే చదువుకున్నావు" అన్నాను అనునయ స్వరంతో.

అత నేదో చెప్పబోయి నలువైపులా భయం భయంగా చూసి "మా అమ్మ నడిగితే కొడుతుంది" అన్నాడు రహస్యంగా.

ఆప్యాయంగా అతని తల నిమురుతూ "ఫర్వా లేదు. నే చేరిపిస్తాలే" అని హామీ ఇచ్చాను. అయితే ఆవిడ్ని ఒప్పించటం ముఖ్యం. ఆవిడతో ఈ విషయం చాలా చాకచక్యంగా ప్రస్తావించాలి. చలపతితో చెప్పాను "నే నేద, చెప్పినా, అడిగినా ఊం కొట్టి ఊరుకోవాలి తెలిసిందా?" అని.

"మీవాడు ఎలాగైతేనేం స్కూల్లో చేరటానికి ఒప్పుకున్నాడండీ. అతన్ని ఒప్పించేసరికి తాతలు దిగొచ్చారు." అన్నాను ఇంటావిడతో. ఎందుకో ఆవిడ ముఖం ముకుచుకుపోయింది. నవ్వు తెప్పించుకుంటూ "మంచిది, చేర్పిస్తాను" అంది ముక్తసరిగా. నే వెళ్లిపోయింతర్వాత వాణ్ణి హత మారుస్తుందని నాకు తెలుసు. వాణ్ణి రక్షించాలనే ఉద్దేశంతో "మీవాడు ససేమీ ఒప్పుకో లేదండీ. భయ పెట్టిగాని ఒప్పించలేకపోయాను," అని అబద్ధం ఆడాను. వాడు కేవలం నా బలవంతంమీదే అంగీకరించాడు గాని ఆవిడ అభిమతానికి వ్యతిరేకంగా సంచరించలేదని నచ్చ చెప్పాను. ఆ తర్వాత చదువుకోని వాళ్లు ఇప్పటి పరిస్థితుల్లో ఎలా చెలామణీ కాలేరో వివరించాను. ఆవిడ మనసు కెక్కేట్టుగా చెప్పుకొచ్చాను.

చివరికి ఆరోజు చలపతికి దెబ్బలపెళ్లి తప్పినందుకు చాలా సంతోషించాను.

ఆరోజు ఆదివారం. నేను గుమ్మంలో కూచుని ఉన్నాను. ఇంటావిడ కూడా తడికవార నే కూర్చుని విస్తరాకులు కుట్టుకుంటోంది. చలపతి ఇంటిముందు దడి కడుతున్నాడు. ఇంటికి మూడువైపులా కాంపౌండు గోడలున్నాయి. ముందుభాగం మాత్రం వెదురు కర్రల్తో కట్టిన దడిమాత్రం ఉంది. అదైనా నామమాత్రంగా వీధికీ, స్థలానికీ హద్దుకోసమన్నట్టుగా కట్టుకున్న బాపతు. కుక్కలూ పందులూ తరుచు ఆ దడిని నాశనం చేస్తూనే ఉంటాయి. తిరిగి బాగుచేస్తున్నాడు చలపతి. నేను ఆమెకు వినిపించేట్టుగానే అన్నాను. "మీవాణ్ణి చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుందండి. ఆ వయసు కుర్రవాళ్ళకి ఆపాటి తెలివితేటలుండటం చాలా అరుదు. దానికి అనుగుణంగా మంచితనం, నెమ్మదీ ఉన్న కుర్రాడు. చదువులోపడితే ఎంతవాడైనా కాగలడు." అన్నాను.

ఆవిడ అపరిమితానందంతో "మీ ఆశీర్వచన ప్రభావంవల్ల వాడు అంతవాడు కావాలనేగా నేనూ కోరేది" అంది.

"ఎందుకాడు? స్కూల్లో చేరిపించి చూడండి ఆ తర్వాత మీకే తెలుస్తుంది. ఇటువంటి కుర్రవాళ్లకి ఉచితంగా చదువు చెబుతారు కూడాను."

ఆవిడకి అర్థం కాలేదు కాబోలు "అంటే?" అంది.

"బీదపిల్లలకి, తెలివైన పిల్లలకి డబ్బు పుచ్చుకోకుండా ఉచితంగా చదువు చెబుతారు. వాళ్ళకయ్యే ఖర్చు ప్రభుత్వమో, లేకుంటే ఏ ధనికులో భరిస్తూంటారు." అని వివరంగా చెప్పాను.

ఆవిడ చర్రుమని లేచింది. "అటువంటి ప్రారబ్ధం మావాడికి పట్టలేదులెండి. నే నే జీతంకట్టి స్వయంగా చెప్పిస్తాను. ఒకళ్ల దయాధర్మాలమీద ఆధారపడే కర్మ వాడికేం పట్టింది." అంది తీవ్రంగా. నేను నాలిక కొరుక్కున్నాను. పొరబాటున బీద పిల్లలకి అని నోరు జారాను. కొంప లంటుకుపోయాయి. ఆ తర్వాత సద్దుకోబోయాను. "మన పిల్లవాడికి వాళ్లు ఉచితంగా చదువు చెబుతున్నారంటే మనవాడు చాలా తెలివైనవాడన్న మాట. అంతేకాని బీదవాడని కాదు." అని.

ఆవిణ్ణుంచి నేనేమీ సమాధానం అందుకోలేదు. కొద్దిసేపు పోయింతర్వాత అంది: పోనీలెద్దురూ నేనే చెప్పిస్తాను. ఏమంత ఖర్చవుతుంది లెండి. ఎటొచ్చీ ఆ బాధ్యత మీరు నెత్తిన వేసుకోవాలి." అని. మనసులో నన్ను నేను అభినందించుకున్నాను. 'తప్పకుండా' అని హామీ ఇచ్చాను.

మా సంభాషణ విననట్టే తన పనిలో తను నిమగ్నుడైపోయాడు చలపతి.

చలపతిని స్కూల్లో చేరిపించటం విషయం సత్యన్నారాయణతో మాట్లాడాను. "మధ్య నీకెందుకి అనవసరపు బెడద" అన్నాడు. "అలా అనకు నా స్వంత వ్యవహారం అనుకో. కుర్రవాడు తెలివైన వాడూ, బుద్ధిమంతుడూను. ఇలా పాడయిపోవటం మంచిదికాదు." అని మరీ మరీ చెప్పాను.

"సరే చేర్పిస్తాలే" అని హామీ ఇచ్చాడు సత్యన్నారాయణ.

*　　*　　*

రాత్రి సినిమాకి వెళ్లానేమో ఉదయం లేచే సరికి బారెడు పొద్దెక్కింది. జాబిరీ గుమ్మంలో కూర్చుని చదువుకుంటున్నాడు చలపతి. తలుపు తీసి లోపలికి వచ్చి కూర్చోమన్నాను.

కాలకృత్యాలు తీర్చుకుని నేనూ పాఠం చెప్ప టానికి ఉపక్రమించేసరికి ఎనిమిది దాటిపోయింది. ఒకటి రెండు లెఖ్ఖలు చేయించి పాతపాఠం అప్ప చెప్పకుని ఆనాటి చదువు అంతటితో ముగించేశాను.

పుస్తకాలు సద్దుకుంటూ చలపతి అన్నాడు. "మా అక్కయ్యకి పెళ్లిసంబంధం వచ్చింది. ఇవాళ సాయంత్రం అక్కాయిని చూట్టానికి వస్తారుట"అని.

ఆ సాయంత్రం ఇంటికొచ్చేసరికి చాలా పొద్దు పోయింది. అందువల్ల పెళ్లికొడుకుని చూట్టానికి పడ లేదు. ఇక ఇంటావిడ ధోరణి విని తీరాలి. ఈ ఊరులో రెండు మేడలున్నాయిట. వాళ్ల స్వగ్రామంలో భూమికూడా ఉందిట. ఇలా ఏవేవో చెప్పు కొచ్చింది. వాళ్లు బాగా ఉన్నవాళ్లనీ, తమ అంతస్థుకు తగినవాళ్లనే నిశ్చయించుకుందనీ చెప్పింది.

"మంచిది" అన్నాను.

"మీబోటి పెద్దల ఆశీర్వచన ప్రభావం వల్ల అదో ఇంటిదైపోతే కొంత బాధ్యత తీరిపోతుంది. ఏమం టారు?"

"కాదుమరీ; ఇంతకీ ముహూర్తం ఎప్పుడో చెప్పారు కారు?"

"ఈ నెల ఆఖరువారంలో జరుగుతుంది," అంది ఆవిడ.

మూడొంతులు అప్పటి కింకా తనకి వెళ్లటం పడదు. పెళ్లికి ఇక్కడే ఉంటాడన్నమాట.

ఇంకా పెళ్లికి ఇరవైరోజుల వ్యవధానం లేదు. నేనాశ్చర్యపోయాను. రెండునెల్లు ముందుగానే మనవాళ్లు నానా హడావుడీ చేస్తూంటారు. ఆమె నిశ్చింతగా నిమ్మకి నీరెత్తినట్టుగా ఉండటం చూస్తే అసలీ పెళ్లి జరిగేదేనా, అసలు నిజమేనా? అనిపించింది. ప్రతిరోజూ వంట చిన్నకూతురే చెయ్యాలి. ఆమె మాత్రం అధికారం చెలాయిస్తూంటుంది. పైపని ఒక్కటి కూడా ముట్టుకోదు. ఎంతసేపూ కబుర్లు. ఏదో ఈ పది రోజులూ ఓర్చుకుంటే ఆమె అదృష్టం బాగుంటే అత్తవారింట్లోనైనా సుఖపడుతుంది. చేసుకున్న భర్త మంచివాడు కావాలి. లేకుంటే ఆడదాని జీవితం ఏముంది? ఎవరి అవసరాలకి వాళ్లు వినియోగించుకుంటారు. ఆమె అదృష్టం ఎలాగుందో మరి.

ఇంకా ముహూర్తం పదిహేనురోజులుండనగా ఓనాడు ఇంటావిడ పెద్దపాకెట్ ఒకటి తీసుకొచ్చి నాముందు పెట్టి "అల్లుడికి బట్టలు కొన్నాం. ఎలాగున్నాయో చూడండి" అంది.

రెండు సూట్లకి సరిపోయే వులన్ క్లాత్. ఒకటి కాఫీరంగు, మరొకటి సిమ్మెంటు రంగు. రెండూ చాలా బాగున్నాయి. నాలుగు చొక్కాగుడ్డలు తీసుకుంది. మొత్తానికి ఓ వంద రూపాయిలు ఖరీదుచేసే గుడ్డ కొంది. "చాలా బాగున్నాయి" అని మెచ్చుకున్నాను. ఈ ప్రశంసకి ఆవిడ చాలా సంతోషించింది.

*　　*　　*　　*

"పెళ్లి తాలూకు బాధ్యతలు నీ నెత్తినా పడ్డాయా?" అన్నాడు సత్యన్నారాయణ.

నాకు కోపం వచ్చినమాట నిజం. "ఏదో ఆ కుర్రాడి విషయంలో కలగచేసుకున్నానుగదా అని వాళ్లకు సంబంధించిన ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నాననా నీ ఉద్దేశం?" అన్నాను.

వాడేమీ సమాధానం చెప్పలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"నీకు బదిలీ అయిందని మీ ఇంటావిడకు తెలుసా?"

ఏమో మరి? నేనుమటుకు చెప్పలేదు.

సత్యన్నారాయణ వెళ్లిపోయాడు. ఆ రాత్రి ఎందుకనో వెంటనే నిద్రపట్టింది. ఉదయం ఆరింటికే

మెలుకువ వచ్చేసింది. కారణం చలపతి కిటికీ అవతల్నించి లేచేవరకూ అరుస్తూనే ఉన్నాడు.

"ఎందుకు చలపతీ?" అన్నాను కళ్లు తుడుచుకుంటూను. అప్పుడే సూర్యోదయం అవుతోంది.

"మా బావని మీరు చూళ్లేదుగా. రండి చూదురుగాని. అమ్మ పిలుచుకురమ్మంది." అన్నాడు చలపతి.

అలాగే నని అతన్ని పంపించేసి నీళ్లు పుక్కిలించి పైపైన ముఖం కడుక్కుని పాచిముఖంతోనే పెళ్లికొడుకుని చూట్టానికి బయల్దేరాను.

రండి. ఇలా కుర్చీలో కూర్చోండి అంటూ మర్యాద చేసింది ఇంటావిడ. నేరుగా వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. పెళ్లికొడుకు నల్లగా ఉన్నాడు. చాలా అర్భకంగా, నీరసంగా కూడా కనిపించాడు. రైల్వేలో గుమాస్తాగా పనిచేస్తున్నాట్ట. మనిషి మంచివాడుగానే ఉన్నాడుకాని ఈ అతిమంచి అతన్ని అత్తగారిముందు ఎలా లొంగదీస్తుందో అనుకున్నాను. ఇంటావిడ చెప్పినట్టుగా చూట్టానికి మంచి స్థితిమంతుడిలానే కనిపించాడు. వయస్సు కూడా పాతికేళ్లకు మించవు. ఈడూ జోడూ అయిన దాంపత్యం అనుకున్నాను మనసులో. మనిషి చూట్టానికి అతి మంచిగా కనిపించినంత మాత్రాన ధైర్యం లేనివాడనీ, అసమర్థుడనీ ఎందు కనుకోవాలి?

అతనూ వెళ్లిపోగానే నేనూ వచ్చేశాను.

*　　　*　　　*

సాయంత్రం ఆరుగంటలయింది ఇంటి కొచ్చేసరికి. ఇంటిముందు పెద్ద గలభా జరుగుతోంది. ఇంటావిడ గుమ్మంలో నిలబడి గొంతు చించుకుని అరుస్తోంది. ఆవిడకంటే కొంచెం పెద్దగా కనుపించే మరో స్త్రీ ఎదురుగా నిలబడి నిప్పులు చెరిగే కళ్లతో రూక్షంగా చూస్తూ సాభినయంగా తిట్టిపోసేస్తోంది. చుట్టూ అయిదారుగురు పైవాళ్లు మూగారు.

లోపలికివెళ్లి తడికవార పడకకుర్చీలో కూర్చుని వింటూ కూర్చున్నాను.

"నీలాటి దగుల్బాజీని నా చెల్లెలంటే కూడా పరువు తక్కువ. ఎంతసొమ్ము! ఎంత సొమ్ము!" ఆమె గుండె బాదుకుంది. ఈ వాక్యాన్ని బట్టి ఆమె ఇంటావిడ అక్కగారని తేలింది. అంతకు రెండింతలు గొంతు హెచ్చించి ఇంటావిడ అడ్డమైన తిట్లూ తిట్టిపోస్తోంది. అసలు తగాదా ఏమిటో స్పష్టంగా బోధపడకపోయినా అదేదో డబ్బుకి సంబంధించినదే అనుకున్నాను. స్వయానా ఓ కడుపున పుట్టిన అప్పచెల్లెళ్లిద్దరూ ఇలా వీధిని పడి నానా మాటలూ అనుకోవటం ఎంత అసహ్యకరమైన విషయం!

ఇంతట్లో తుపానులా ఆ కొత్తవ్యక్తి నన్ను సమీపించి "మీరు వినండి. దీని మాయమాటలు, మాయ నటనకి మోసపోయి ఒకటి కాదు రెండు కాదు నాలుగొందలు దీని చేతిలో పోసాను. రెండేళ్లయిపోయింది. దమ్మిడీ వడ్డీ లేదు సరికదా అసలుకే ఎసరు పెడుతోంది. ఇంత సొమ్మూ కాజేసింది కాక పైగా నే నెప్పుడో దీని మొగుడుదగ్గర ఆరొందలు తీసుకున్నానుట! దానికీ దీనికీ చెల్లుట! ఎంతలా కల్పించిందో చూశారా? అంతా అబద్ధం!"—ఆవిడ మాట్లాడుతూంటే గొంతునాళాలు ఉబ్బుతున్నాయి. ముఖం ఎర్రబడిపోయింది.

ఇంటావిడ ఉన్నట్టుండి నోరు జారింది; "ఈ విషయంలో ఇంకొకళ్ల జోక్యం అనవసరం" అని. "నాకు చచ్చేటంత అభిమానం వేసింది. నాకేం తెలుస్తుందమ్మా! నువ్వివ్వటం నే చూశానా? కొత్తవాణ్ణి" అని చెప్పి ఆవిణ్ణి వదిలించుకున్నాను. ఆతర్వాత ఇద్దరూ చాలాసేపు ఘర్షణపడ్డారు. పర్యవసానం, వాచిపోయిన గొంతుతో, ఉత్తి చేతుల్తో ఆ కొత్త వ్యక్తి వెళ్లిపోయింది. ఆమెకి దక్కిందల్లా తిట్లూ, చివాట్లూ మటుకే.

ఆతర్వాత చాలా రోజులు ఇంటావిడతో నేను మాట్లాడనే లేదు. ఆ విషయం ఆవిడ గ్రహించిం దనటానికి నిదర్శనంగా చలపతి చదువుకుందుకు రావటం మానేసాడు.

అక్కగారివద్ద అయిదొందలూ అప్పుగా తీసుకున్న మాట నిజమేననీ, ఆ సొమ్ముతోనే మూడు వైపులా కాంపౌండు గోడ కట్టిందనీ, ఆ అప్పు తీర్చటం ఇష్టంలేక అలా అబద్ధం ఆడిందనీ సత్యనారాయణ చెబుతుంటే నే నాశ్చర్యపోయాను.

"నే ననేదేమిటంటే ఆ అప్పు ఆవిడ తీర్చలేకపోయినట్టయితే మనసులో ఉన్నది ఉన్నట్టుగా తన అసహాయతని వ్యక్తం చేసుకుని మంచిగా మాట్లాడితే ఆ అక్కగారు ఆ సొమ్ము ఎప్పుడో వదులుకునేది.

అయితే అందుకు ఈవిడ పౌరుషం అడ్డొస్తుందిగా మరి. అక్కడే ఒచ్చిన చిక్కల్లా" అన్నాడు సత్యన్నారాయణ.

పెళ్లికి పిలుస్తే వెళ్తావా?" అని అడిగాను.

సత్యన్నారాయణ పెద్దగా నవ్వుతూ "నీకు మతిపోయిందా ఏమిటి? నన్నెందుకు పిలుస్తుంది? కల్లోకూడా అలా జరగదు." అన్నాడు.

*     *     *     *

ఇంటావిడతో మాట్లాడటం మానేసి ఇవ్వాల్టికి వారం రోజులయింది. పెళ్లి వారం పదిరోజు లుందనగానే నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చేశాయి. ఇలా జరుగుతుందేమోనని అనుమానిస్తూనే ఉన్నాను. ఇలా అని చెప్తే ఆవిడ అపార్థం చేసుకుంటుందేమోనని అదో బాధ. ధైర్యంచేసి "రేపు సాయంత్రం నేను విజయనగరం వెళ్లిపోతున్నాను. బదిలీ అయింది. అలా అని మీ అమ్మగారితో చెప్పు" అన్నాను చలపతితో.

చీకటి అప్పుడప్పుడే పడుతోంది. ఇవ్వాళ సాయంత్రం కొద్దిగా వానకూడా పడిందేమో కొద్దిగా ఉక్కబోస్తోంది. దీపం వెలిగించి కొంకికి తగిలించి బట్టలు తీసి పెట్టెలో సర్దుకుంటున్నాను. ఏదో అనిర్వచనీయమైన ఉత్సాహం నన్నావరించింది. ఇలూవాకిలీ, భార్యా, పిల్లలూ అంతా కళ్లముందు మెదుల్తున్నారు.

"బాబూ!" ఉన్నట్టుండి మా జాబిరీలోంచి ఇంటావిడ గొంతు వినిపించింది. ఆలోచనలు మంచు మాయమయినట్టుగా మాయమయాయి. లేచి గుమ్మంలోకి వెళ్లాను.

నేనేదో పొరబాటున తప్పుచేస్తే మీ రిలా శిక్షించటం న్యాయమా చెప్పండి? ఆడదాన్ని. మీరు క్షమించకపోతే నా కెవరు దిక్కు. ఒంటరిగా ఇంత పెద్ద బాధ్యత నే నొక్కతినీ నిర్వర్తించగలనా? మిమ్మల్ని వేడుకుంటాను. వెళ్లిపోకండి" అంది రుద్ధకంఠంతో.

నాకేమి చెప్పాలో పాలుపోవటంలేదు. ఉద్యోగ ధర్మాలు ఆమెకి బోధపడవు. ఆవిడమీద కోపగించి మరో ఇంటికి పోతున్నానని ఆవిడ అనుమానం కాబోలు. "నాకు మావూరు బదిలీ అయింది. నిన్ననే వెళ్లాల్సినమాట. ఇదిగో ఆర్డర్సు చూడండి" అంటూ జేబులోంచి కాగితాలు తీసి ఆమె కివ్వబోయాను.

ఆవిడ చెయ్యి అడ్డంపెడుతూ "అక్ఖర్లేదు. మీ మాటలు నేను నమ్మను. ఒక్క వారంరోజులు ఆగటానికి వీల్లేదూ?" అంది ప్రాధేయపడుతున్నట్టుగా.

"క్షమించండి. నే వెళ్లితీరాలి" అన్నాను గత్యంతరం లేక.

"సరే అయితే ఇవ్వాళ తారీఖు ఇరవైమూడు కదూ. మీ అడ్వాన్సు ముఫైరూపాయిల్లో మీకే నేను ఏడురూపాయిలు బాకీఉంటాను" అంటూ ఆమె నే నెంత అభ్యంతర పెడుతున్నా వినకుండా ఏడురూపాయిలూ కుర్చీమీద పెట్టి "మీవాళ్లనందర్నీ అడిగానని చెప్పండి. నేను మళ్లీ పొద్దున్నే ఊళ్లోకి వెళ్లిపోతున్నాను. నే నొచ్చేసరికి మీరు ఉంటారో ఉండరో. తాళాలు మా చలపతి వేస్తాడు." అంటూ ఆమె వెళ్లిపోయింది.

నేను మావూరు వెళ్లిపోవటం ఈవిడ్నింతగా బాధిస్తుందని నే నూహించలేదు. ఆమె ఎందుకు అయినవాళ్లందరితో విరోధం పెట్టుకుందో, కన్నకూతురు విషయంలో కూడా ఆవిడంత ఖచ్చితంగా ఎందుకు మసులుకుంటుందో నే నర్థంచేసుకోకపోలేదు. ఇంత చెడ్డతనాన్ని (చాలామంది దృష్టిలో) ఆవిడ బలవంతాన అలవర్చుకున్నదని నాకు తెలుసు. ఆ స్వభావమే ఆ చిన్నకుటుంబానికి శ్రీరామరక్ష! ఎవరితోనూ పరిచయం వృద్ధిచేసుకోవటానికి ఆవిడ ప్రయత్నించదు. తల్లైనా తండ్రి అయినా, ఆమె అనుసరించే విధానం అదే. అందువల్ల ఎవరూ ఆమె గుమ్మం ఎక్కరు. ఇంటిమీద అద్దెపెట్టుకుని తినో తినకో కాలక్షేపం చేస్తోంది. ఆ సంపాదనలోనే ఓ కూతురు పెళ్లిచేసింది. ఇంకో కూతురు పెళ్లి చెయ్యబోతోంది. అలాటిది సాధ్యమా అంటే సాధ్యమే అని ఆమె ఋజువుచేస్తోంది. చుట్టాల మనుకుంటూ వచ్చి తిష్టవెయ్యటానికి వాళ్లకాయింట్లో పచ్చి మంచినీళ్లు పుట్టవు. కనకనే ఆ సంసారం అలా నెట్టుకొస్తోంది గుంభనగా.

బండి కదలబోయేవరకూ, చలపతి నా కూడాకూడా తిరిగాడు. సత్యన్నారాయణకూడా స్టేషనుకి వచ్చాడు. బండి కదలబోయేముందు జారిపోతున్న

లాగూ పైకి లాక్కుంటూ "నన్ను స్కూల్లో ఎవరు చేరిపిస్తారూ?" అన్నాడు.

పక్కనే నిలబడ్డ సత్యన్నారాయణకి చలపతిని బళ్లో చేరిపించటం విషయం జ్ఞాపకం చేశాను. "నే నున్నానుగా. నే చేరిపిస్తాలే" అన్నాడు సత్యన్నారాయణ. చలపతి ముఖం ఇంతయిపోయింది.

రైలు కదిలింది. చలపతి మరి కనుపించలేదు. ఆ ప్రయాణం రద్దీలో, చోటుకోసం చేసే పెనుగులాటల్లో, కునికిపాట్లలో ఇంటికి చేరుకున్న మర్నాటివరకూ ఇంటావిడ నాకు జ్ఞాపకం రాలేదు. ఇంటికి చేరగానే చలపతికీ, సత్యన్నారాయణకీ ఇద్దరి పేరా ఉత్తరాలు రాశాను.

వారం రోజుల తర్వాత ముందుగా చలపతి రాసిన ఉత్తరం అందింది. ఉత్తరం విప్పిం తర్వాత ఇంటావిడ రాసిందని తెలుసుకున్నాను. కింద సంతకం మటుకు లేదు.

బాబుగార్కి!

నమస్కారాలు. మీరు దయతో రాసిన ఉత్తరం అందింది. ఈ ఊరు పొలిమేరలు దాటిం తర్వాత మేం జ్ఞాపకం ఉంటామనుకోలేదు. చాలా సంతోషించాను. ఇక అమ్మాయి పెళ్లిగురించి. చాలా వైభవంగా జరిగిందనే చెప్పాలి. ఇంటిముందు పెద్ద పందిరి వేయించాను. బాజా బజంత్రీలకే అయింది రెండొందల వరకూ. బంధువులు చాలామంది వచ్చారు. వీళ్ళందరికీ మూడు రోజులూ భోజనాలూ, టిఫిన్లూ, కాఫీలూ —మొత్తంమీద పదిహేనొందలదాకా తిండికిందే ఖర్చయిపోయింది. పోనీలెండి అయితే అయింది. ఏదో పెళ్లంటూ జరిగిపోయింది. అదే సంతోషం!"—

పెళ్లి వైభవంగా జరిగినందుకు సంతోషించాను. ఇంత సొమ్ము ఎక్కణ్ణుంచి తెచ్చిందో మరి.

ఆతర్వాత రెండు రోజులు పోయింతర్వాత సత్యన్నారాయణ రాసిన ఉత్తరం అందింది.

నువ్వు రాసిన ఉత్తరం చదివాను. నువ్వెళ్లింతర్వాత రెండు రోజులు ఒంట్లో అదోలాగుండి ఆఫీసుకే వెళ్లలేదు. అన్నట్టు మరో విషయం! మీ ఇంటావిడ చిన్నకూతురు పెళ్లి అయిందీ అనిపించింది. ఎలా జరిగిందని అడక్కు. ఆమెగురించి నీకు తెలియనిదేముంది? ఇంటిముందు నాలుగుగడలు పాతి వాటిమీద రెండే రెండు పచ్చికొబ్బరిఆకులు పరిచింది. ఆ బ్రహ్మాండమైన పందిట్లోనే ఆ రాత్రి వివాహం జరిగింది. ఒచ్చిన బంధువులే కొద్దిమంది. ఒక్కపూట వాళ్ళకాయింట్లో అన్నప్రాప్తి లేకపోయింది. పెళ్లయిన మర్నాడు ఉదయమే వాళ్లు పెట్టే బేడా సర్దుకుని వెళ్లిపోయారు. పెళ్లికొడుకు మంచివాడు కాబట్టి సరిపోయింది. ఆమెనికన్న తండ్రి గాని, తోబుట్టువు గాని, ఎవరూ ఆ పెళ్లికి ఆహ్వానించబడలేదు. ఒక్క పునిస్త్రీ పడుచు పాదాలకి ఇంత పసుపు రాసి ఓ రవికలగుడ్డయినా పెట్టలేదావిడ. అంతా ముక్కుమీద వేలు వేసుకున్నవారే! ఇదా పెళ్లంటే?......"— నివ్వెరపోయాను. మరుక్షణంలో ఎందుకో విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది. మా ఇంటావిడ గురించి నా భార్య కొద్దిగా నాద్వారా విని ఉన్నా ఈ రెండు ఉత్తరాలూ మటుకు ఆమెకి చూపించదల్చుకోలేదు. ఇంకా కొంతమందిచేత ఆమెను తిట్టించి, అపహాస్యంపాలు చెయ్యటంవల్ల నా కొరిగే దేమిటి? నా దృష్టిలో ఆమె నాటికి డెభ్భైపాళ్ళు మంచిమనిషిలాగానే కనిపించింది.